## క్లుప్తంగా

### ఎంపీ అర్వింద్‌ను సన్మానించిన అర్బన్ ఎమ్మెల్యే



ఎంపీ అర్వింద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: నిజామాబాద్‌కు పసుపు బోర్డు సాధించిన తర్వాత మొదటిసారిగా నగరానికి వచ్చిన ఎంపీ అర్వింద్ ధర్మపురిని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోళ్ల లక్ష్మీనారాయణ, నాయకులు మఠం పవన్, బట్టికారి ఆనంద్ ఉన్నారు.

### ఎంపీ అర్వింద్‌ను కలిసిన పెన్షనర్ల సంక్షేమ కమిటీ



ఎంపీ అర్వింద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెన్షనర్ల సంక్షేమ కమిటీ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమ కమిటీ సభ్యు లు సోమవారం బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వెళ్లే రైళ్ల విషయంలో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక రైలు కూడా లేదని, ఇప్పటి వరకు ఉన్న రైళ్లు అన్ని రద్దు చేయబడి మళ్లింపు చేయడం జరిగిందన్నారు. మళ్లించిన రైళ్లను పునరుద్ధరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్ వెల్‌ఫేర్ కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షులు పి.ప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి షేక్‌హుస్సేన్, పెన్షనర్లు, ఉద్యోగులున్నారు.

### ఆర్ఎంపీ, పీఎంపీల ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న హైదరాబాద్‌లో ఆత్మగౌరవ సభ నిర్వహించనున్నారు. ఈసభకు సంబంధించిన పోస్టర్‌లను సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పుల్లం హన్మండ్లు మాట్లాడుతూ ఆత్మగౌరవ సభకు జిల్లా నుంచి పీఎంపీ సభ్యులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రవి వర్మ, జాయింట్ సెక్రెటరీ రాములు, కార్యదర్శి గోపి, మండల అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి వహీద్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అశ్వక్, నగేష్ తదితరులు పాల్గొన్నారు

### డీఈవోకు 'సిరిలేఖలు' పుస్తకం అందజేత



డీఈవోకు పుస్తకం అందజేస్తున్న నరేష్‌రావు

మోపాల్: మండలంలోని సిర్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రచించిన లేఖల సంకలనం సిరిలేఖలు పుస్తకానికి జిల్లా విద్యాశాఖ అధికారి పి అశోక్ సోమవారం అభినందనలు తెలియజేశారు. ఈమేరకు సోమవారం డీఈవో అశోక్‌కు పుస్తక సంపాదకులు డాక్టర్ కాసర్ల నరేష్‌రావు పుస్తకం అందజేశారు. సిరిలేఖలు పుస్తకం త్వరలో విడుదల కానుందని నరేష్ తెలిపారు.

### దుబాయిలో సేవాలాల్ జయంతి



సేవాలాల్ జయంతిలో పాల్గొన్న జిల్లాకు చెందిన గిరిజనలు

ధర్పల్లి: దుబాయిలో నివసిస్తున్న జిల్లాకు చెందిన గిరిజన ప్రవాసులు ఆదివారం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం అందరు కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని గిరిజన నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో రామచంద్రనాయక్, గణేష్ నాయక్, శేఖర్ నాయక్, చింటూ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్న పంటకు రక్షణగా చీరలు



ముల్లంగి(ఐ) గ్రామ శివారులో మొక్క జొన్న పంటకు రక్షణగా కట్టిన చీరలు

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం ముల్లంగి(ఐ) గ్రామానికి చెందిన రైతులు మొక్క జొన్న పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మొక్క జొన్న కంకులు తయారవుతున్నాయి. అడవి పందులు రాత్రి వేళల్లో పంట చేలపై దాడులు చేస్తూ పంటను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో అడవి పందుల నుంచి మొక్క జొన్న పంటను రక్షించుకునేందుకు రైతులు పంట చుట్టూ పాత చీరలను రక్షణగా కడుతున్నారు.

## 'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి



డిచ్‌పల్లిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

డిచ్‌పల్లి: ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ మండల కార్యదర్శి జేపీ గంగాధర్ పేర్కొన్నారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు గడిచిందన్నారు. ఈకార్యక్రమంలో పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఎం.సుప్రియ, రాజు, గంగాధర్, సాయిలు, లలిత, గంగన్న తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గిరిజా కల్యాణం



స్వామివారి ఆశీస్సులు తీసుకుంటున్న ధన్‌పాల్ సూర్యనారాయణ దంపతులు

నిజామాబాద్‌రూరల్ : నగరంలోని కిషన్ గంజ్‌లో గల పట్టణ ఆర్యవైశ్య సంఘంలో సోమవారం ఉదయం సామూహిక గిరిజా కల్యాణం, సాయంత్రం సామూహిక లక్ష పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. వైశ్య కుల గురువు శ్రీసంస్థాన్ హళదీపుర వైశ్య పీఠాధిపతి హళదీపుర వామనాశ్రమ మహాస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలు సాగాయి. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ దంపతులు పాల్గొని స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పార్శి ఆత్మారాం గుప్తా, పెద్ది రాజేందర్ గుప్తా, పెండ్యాల శ్రీనివాస్ గుప్తా, పాల్తి రవికుమార్ గుప్తా, పార్శి రాఘవేందర్ గుప్తా, ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## స్కేటింగ్ క్రీడాకారులకు ఘన సన్మానం



సాధించిన పతకాలతో క్రీడాకారులు

నిజామాబాద్‌నాగారం : లస్సనియా స్కేటింగ్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో మొయినాబాద్‌లోని సుజాత స్కూల్లో రాష్ట్రస్థాయి స్కేటింగ్ పోటీలను ఈనెల 16,17న నిర్వహించారు. ఈ పోటీలకు జిల్లా నుంచి వివిధ కేటగిరీలలో దాదాపుగా 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 8 మంది బంగారు, 12 మంది రజత, 10మంది క్రీడాకారులు కాంస్య పతకాలను సాధించినట్లు రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామచందర్ తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు బహుమతులు అందుకున్నారు. ఈసందర్భంగా క్రీడాకారులను సన్మానించారు. జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నిజామాబాద్ జిల్లా సిమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి మహిపాల్, యోగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, జిల్లా వాలీబాల్ కోచ్ సాయిలు, స్కేటింగ్ కోచ్‌లు గణేష్, శంకర్, జయరాం, సాయి శ్రీధర్ నాయక్ ఉన్నారు.

## రైతు సమస్యలపై పోరాడుదాం



మాట్లాడుతున్న పెద్దివెంకట్రాములు

నిజామాబాద్ సిటీ : తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుదామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్రాములు అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా రాజకీయ అవగాహన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఉపాధిహామీ పథకానికి రూ. 2లక్షల 44 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి 200 పనిదినాలు కల్పిస్తూ వారికి రోజుకు రూ.600 చొప్పున కూలీ ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలిచ్చి నిర్మాణం కోసం రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు నాగేశ్వర్, రమేష్‌బాబు, వెంకటేష్, సిర్ప లింగం తదితరులు పాల్గొన్నారు.

## ఆహార కల్తీపై అవగాహన పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సాంబరాజు చక్రపాణి

జక్రాన్‌పల్లి: ఆహార కల్తీ విషయంలో ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి సూచించారు. సోమవారం మండలంలోని పడకల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆహార కల్తీపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకులైన ఉప్పు, పప్పు, నూనెలో ఆహార కల్తీ జరుగుతుందన్నారు. అయోడిన్, ఉప్పులు ప్లాస్టిక్ సంచుల్లో వాడకం వల్ల ప్రజలు క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. విజిలెన్స్ కమిటీల్లో వినియోగదారుల ప్రతినిధులను నియమించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల కమిటీ రూరల్ అధ్యక్షుడు యాటకర్ల దేవేష్, జిల్లా ఉపాధ్యక్షురాలు వర్మ, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, గైని రత్నాకర్, శ్రీనివాస్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాణి, టీచర్ శోభ తదితరులు పాల్గొన్నారు.

## వంగా మహేందర్‌రెడ్డికి మద్దతు తెలిపిన ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు పెంట అంజయ్య

నిజామాబాద్‌అర్బన్: పీఆర్టీయూ బలపర్చిన ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డికి ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం( రిజిస్టర్ నంబర్ 1143) రాష్ట్ర శాఖ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు పెంట అంజయ్య, గౌరవ అధ్యక్షులు మోతే సాయన్న తెలిపారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి స్పష్టమైన హామీ ఇవ్వడంతో రాష్ట్ర శాఖ ఈ నిర్ణయం తీసుకుందన్నారు. సోమవారం జిల్లాల పర్యటనలో భాగంగా ఆయన శంకర్‌భవన్‌లో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రామచందర్ గైక్వాడ్, భూషణ్, రాష్ట్ర కోశాధికారి సుశీల్ కుమార్, బైండ్ల శ్రీనివాస్, ఎన్ రాజు, సవిత, మమత, సౌందర్య, సంతోష్, ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు జిల్లాలో వామపక్షాల నిరసనలు



మాట్లాడుతున్న నాయకులు

నిజామాబాద్ సిటీ : కేంద్ర బడ్జెట్లో సవరణలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18, 19న జిల్లాలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వామపక్షాల పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ ... బడ్జెట్‌లో పేదలను విస్మరించడం, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేటాయింపులు చేయటాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా వామపక్ష పార్టీలు నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. ఈ నిరసన కార్యక్రమాల్లో ప్రజాస్వామ్యవాదులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వామపక్ష నాయకులు రమేష్‌బాబు, సుధాకర్, ఆకుల పాపయ్య, పెద్ద వెంకట్ రాములు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ భూములు కాపాడాలని వినతి



కోటగిరి (రుద్రూర్): కోటగిరి మండల కేంద్రంలో కబ్జాకు గురవుతున్న భూములను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం తహసీల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాలకు సరిహద్దులు నిర్ణయించి స్వాధీనం చేసుకోవాలని కోరారు. కబ్జా చేసిన ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్‌రావ్, నవీన్ తదితరులున్నారు.

### జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లిని కలిసిన నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంతోష్ నాయక్

సిరికొండ: జిల్లా కేంద్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా నాయకుడు సంతోష్‌నాయక్ సోమవారం కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని మంత్రితో వివరించినట్లు ఆయన తెలిపారు. మంత్రికి ఆయన పుష్పగుచ్ఛం అందజేశారు.

### వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

రెంజల్/నవీపేట్: వేసవిలో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ ఆర్. రవీందర్ పేర్కొన్నారు. నవీపేట్ మండలంలో నూతనంగా నిర్మించిన పనులను ప్రారంభించారు. రూ. 40 లక్షల వ్యయంతో జన్నెపల్లి, కమలాపూర్ సబ్‌స్టేషన్‌లను కలుపుతూ 6.5 కిలోమీటర్లలో నూతనంగా నిర్మించిన 33 కేవీ లైన్‌తో పాటు రూ. 17 లక్షలతో 11 కేవీ బ్రేకర్‌లను ప్రారంభించారు. నాళేశ్వర్-నిజాంపూర్ సబ్‌స్టేషన్‌లను సందర్శించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్, ఏడీఈ ప్రశాంత్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌లతో పాటు నాళేశ్వర్, నిజాంపూర్ గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

### ఓబీసీ సెల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు



సమావేశంలో పాల్గొన్న జిల్లా నాయకులు

సిరికొండ: హైదరాబాద్ గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ సమావేశంలో మండలానికి చెందిన నాయకులు పాల్గొన్నారు. ఏఐసీసీ ఓబీసీ చైర్మన్ అజయ్‌సింగ్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలనర్సయ్య, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజ నరేందర్‌గౌడ్‌లతో కలిసి సిరికొండ మండలాధ్యక్షుడు పిట్ల నర్సింగ్ పాల్గొన్నారు. సమావేశంలో కులగణనపై, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తదితర అంశాలపై చర్చించినట్లు నర్సింగ్ తెలిపారు.

## ఘనంగా వేంకటేశ్వర స్వామి జాతర



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్‌లో సోమవారం శ్రీ వేంకటేశ్వర స్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ జాతర ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కర్నాటి యాదగిరి ఆదర్శప్రాయుడు



మాట్లాడుతున్న రమ

నిజామాబాద్ సిటీ : కమ్యూనిస్టు నాయకుడిగా సుదీర్ఘంగా సీపీఐ(ఎం.ఎల్) పార్టీకి సేవలందించిన కర్నాటి యాదగిరి ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కేజీ రామచందర్, కే.రమ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో యాదగిరి సంస్మరణ సభ నిర్వహించారు.ఈకార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని జీవితాంతం విప్లవోద్యమంలోనే కొనసాగారన్నారు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా 40 ఏళ్లు పనిచేశారన్నారు. యాదగిరి అంకితభావం యువతరానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మరణించిన తర్వాత కూడా వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం తమ శరీరాన్ని, నేత్రాలను దానం చేశారన్నారు. ఈకార్యక్రమంలో వామపక్ష నాయకులు వి.ప్రభాకర్, ఎం.నరేందర్, పి.రామకృష్ణ, ఎం.వెంకన్న, బి.దేవారం, డి.రాజేశ్వర్, ముప్కసుధాకర్, గంగాధర్, ముత్తెన్న, సాయన్న, మల్లేష్, సురేష్, కిషన్, సత్తెక్క, డి.కిషన్, రమేష్, మురళి, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



హాజరైన కార్యకర్తలు

## కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న బాధితులు రమేష్, గంగామణి

నిజామాబాద్ నాగారం: తమ భూమిని కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు రమేష్, గజ్జల గంగామణిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు నిజామాబాద్ ప్రెస్ క్లబ్ లో సోమవారం వారు మాట్లాడారు. రెంజల్ మండలంలోని వీరన్న గుట్ట గ్రామ శివారులో 1292 సర్వేనెంబర్ లో గల తమ 11 గుంటల భూమిని గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి అనే వ్యక్తి కబ్జా చేశారని వారు ఆరోపించారు. భూమిని కబ్జా చేసుకోవడమే కాకుండా కంచె వేసుకున్నారని, దీనిపై ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. తమకు అతని నుంచి ప్రాణహాని ఉందని, ఉన్నతాధికారులు స్పందించి శ్రీనివాస్‌రెడ్డిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

### కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన జెడ్పీ మాజీ చైర్మన్



నిజామాబాద్ అర్బన్: మాజీ సీఎం కేసీఆర్‌కు జెడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్ నివాసంలో ఆయన్ను కలిశారు.

### బంగారం ధరలు (10గ్రాములు)

| | | | |
|---|---|---|---|
| 24 క్యారెట్స్ | 88,200 | వెండి(కిలో) | 1,05,000 |
| 22 క్యారెట్స్ | 81,400 | | - నిజామాబాద్ బిజినెస్ |

### మాంసం ధరలు

| | | | |
|---|---|---|---|
| చికెన్ | ధరలు (కిలోకు) | డ్రెస్డ్ | 160 |
| | | లైవ్ | 100 |
| స్కిన్‌లెస్ | 180 | మటన్ | 800 |

### కూరగాయల ధరలు(రూ.)

| | హోల్‌సేల్ | రిటైల్ | | హోల్‌సేల్ | రిటైల్ |
|---|---|---|---|---|---|
| టమాట | 6 | 12 | గాజరుగడ్డ | 30 | 50 |
| బెండకాయ | 40 | 80 | పచ్చిమిర్చి | 40 | 60 |
| జీరకాయ | 50 | 80 | దోసకాయ | 30 | 50 |
| దొండకాయ | 30 | 50 | ఆలుగడ్డ | 20 | 40 |
| బీర్నీసుకాయ | 40 | 60 | గోబిగడ్డ | 10 | 20 |
| కాకరకాయ | 30 | 50 | గోబిపువ్వు | 20 | 40 |
| వంకాయ | 10 | 20 | బీట్‌రూట్ | 30 | 50 |
| పాలకూర | 10 | 20 | కరివేపాకు | 60 | 110 |
| మెంతికూర | 15 | 30 | చామగడ్డ | 40 | 80 |
| కొత్తిమీర | 10 | 20 | గోరుచిక్కుడు | 40 | 80 |
| పుదీనా | 40 | 80 | చిక్కుడుకాయ | 50 | 70 |
| క్యాప్సికం | 40 | 60 | | | |

- సుభాష్‌నగర్

### వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



**ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)**

- స్క్రీన్-1: ఛావా(హిందీ)- 11.00, 1.40, 10.20; తండేల్(తెలుగు)-4.35, 7.30
- స్క్రీన్-2: తండేల్(తెలుగు)-11.00,1.45,7.40, 10.20 -ఛావా(హిందీ)-4.30
- స్క్రీన్-3: లైలా(తెలుగు)-10.45,1.45,7.35, 10.20; బ్రహ్మ ఆనందం(తెలుగు)- 4.30

**పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)**

- స్క్రీన్-1: కెప్టెన్ అమెరికా(తెలుగు)-10.45, 7.20; లైలా(తెలుగు)-1.25; తండేల్(తెలుగు)-4.15, 10.00
- స్క్రీన్-2: ఛావా(హిందీ)-10.00, 4.00, 10.25; కెప్టెన్ అమెరికా(3డీ తెలుగు)-1.20; తండేల్(తెలుగు)-7.25
- స్క్రీన్-3: తండేల్(తెలుగు)-10.30; నిదురించు జహాపన(తెలుగు)-1.35; లైలా(తెలుగు)-4.10; ఛావా(హిందీ)-7.00; సనమ్ తేరి కసమ్(హిందీ)-10.20
- స్క్రీన్ -4: తల(తెలుగు)-10.55; సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-1.35, 7.40 - బ్రహ్మ ఆనందం(తెలుగు)-4.35; లైలా(తెలుగు)-10.40

- లలితామహల్: తండేల్(తెలుగు)
- దేవి: లైలా (తెలుగు)
- నటరాజ్: ఛావా(హిందీ)
- విజయ్: సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)